


నా కళ్ళెదుటే అంతా రెప్పపాటులో జరిగిపోయింది....

అప్పుడు చిటపట చినుకులు పడుతున్నాయి. 'వాన రాకడ - ప్రాణం పోకడా తెలియదనేగా' అన్నారు ఆర్యులు?

మళ్ళీ వెంటనే ఎక్కడికైనా బయలుదేరాలి కామోసు - డాక్టర్ శ్రీధర్ కారును మామూలుగా కాంపౌండ్ గేట్ గుండా లోపలికి తీసుకొని తన డిస్పెన్సరీ పోర్టికో ముందు ఆపకుండా - రోడ్డుమీదే అటువైపున ఆపాడు. అక్కడ కారు దిగాక రోడ్డును క్రాస్‌చేయబోతున్నవాడల్లా చివాలున ఎడమ వైపుకు తిరిగాడు. ఒక కారు రఁయ్‌మని వస్తోంది....ఇంకో రెండు క్షణాలలో ఆ కారు డాక్టర్ శ్రీధర్‌ను దాటబోతోంది. అతను గుడ్లప్పగించి ఆ కారు వంకే చూస్తూండిపోయాడు. ఆ కారు కూడా సరిగ్గా అతనికేసే వస్తోంది. తప్పుకోడానికి ఎటు కదలాలో తోచక అతను నిలువునా కంపించిపోవడం అతని డిస్పెన్సరీ వరండాలో నిలుచోనున్న నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

ఏం జరగబోతుందోనని భయంతో నేను ఊపిరి బిగబట్టాను.

అనుకున్నంతా అయింది. మరో క్షణంలోనే ఆ కారు ఒక్క కుదుపు కుదిపింది. నిటారుగాఉన్న డాక్టర్ శ్రీధర్ మొదలు నరికిన మ్రానులా నేల కూలాడు. టయర్లు అతని ముఖం, కాళ్ళమీదుగా వెళ్లాక ఆ కారు వేగం మరింత హెచ్చింది.

గబగబ వసారా మెట్లు దిగి పరుగుతీశాను. కాని, అప్పటికిక మానవ ప్రయత్నంవల్ల ఎలాటి ప్రయోజనమూ ఉండదని నాకు తెలుసు.

కొన్ని క్షణాలపాటు విలవిల తన్నుకున్నాక డాక్టర్ శ్రీధర్ కాళ్ళు, చేతులు నిర్జీవంగా పడిపోయాయి. తల పక్కకు ఒరిగింది. అతని చుట్టూ రక్తం మడుగు....ఆ దృశ్యం అతి భయంకరంగా ఉంది.

తూర్పుదిశగా శరవేగంతో వెళ్లిన ఆ కారు మాత్రం రోడ్డు మలుపు తిరిగి పోయింది.

వాన వెలిసింది....చుట్టూ గంభీరమైన నిశ్శబ్దం....ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకొని, "ఏమిటండి? ఏం జరిగింది?" అన్న కమ్మని కంఠం వినిపించింది. డాక్టర్ శ్రీధర్ డిస్పెన్సరీ వైపు చూశాను.

నర్సు రీటా - తనలాగే గౌను తొడుక్కొని పాశ్చాత్య వేషధారణలో ఉన్న ఓ యువతితోపాటు వరండాలోకి వచ్చి నిలుచున్నదల్లా "అరే! డాక్టర్‌గారే!" అంటూ గాబరాతో రోడ్డుకేసి పరుగున రాసాగింది.

అప్పుడు సమయం నాలుగు గంటలు.

సాయంత్రం ఆరు గంటలదాకా పోలీసువారు నన్ను ఆ డిస్పెన్సరీలోనే నిలబెట్టేశారు. వాస్తవానికి ఆ ఘోర ప్రమాదాన్ని కళ్ళారా చూసిన సాక్షి నే నొక్కడ్నేగా? అప్పుడు చినుకులు పడుతూండడంవల్ల రోడ్డుమీద జన సంచారం బొత్తిగా లేదాయె.

ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌ను నేను బాగా ఎరుగుదును. ఆయన జేబులోంచి డైరీని బయటకు తీస్తూ, "వొళ్ళు తెలీకుండా వాహనాలను నడపడం ఈ నగరంలో అంటువ్యాధిలా ప్రబలిపోయింది. ఇటీవల మరీనూ....రోజుకు ఎన్ని ప్రమాదాలు! అజాగ్రత్తగా కార్లు నడిపేవారికి కఠిన శిక్షలు పడితే గాని, మిగతావారికి బుద్ధి వచ్చేటట్లు లేదు...చెప్పండి అశోక్‌గారూ, ఆ కారును మీరు చూశారుగా? అని అడిగాడు.

"ఆఁ....చూశాను. బ్యూక్ కారు... 1956 మాడల్...నీలం రంగుది.... టైర్లకు వలయాకారంలో అంగుళం మేరకు తెల్లపూత పూసి ఉంది....ఆ క్షణంలో నేను గమనించ గలిగిందంతే.''

"ఆ కారు నెంబరును చూసే అవకాశం లేకపోయిందా – లేక, ఆ సమయంలో ఆ కారు నెంబరును గమనించాలన్న తలంపు మీకు కల్గలేదా?"

"నెంబరును చూసే అవకాశం లేకపోయింది."

"సరే....ఉండండి - ఇప్పుడే వస్తా," అంటూ ఇన్‌స్పెక్టరు ఈశ్వర్ రోడ్డుమీద ఆపిఉన్న పోలీస్ వాన్ దగ్గరికి నడిచాడు. అందులోని మైక్రోఫోన్‌ను అతను చేతికి తీసుకోగానే నే ననుకున్నాను - ఆ బ్యూక్‌కారు గురించి అతను కంట్రోల్ సెక్షన్‌కు, ఆ తర్వాత నగరంలోని పోలీస్ స్టేషన్లకన్నింటికీ వయెర్లెస్ ద్వారా వర్తమానాన్ని అందజేస్తూండాలని.

ఐదు నిమిషాలు గడిచాక ఇన్‌స్పెక్టరు ఈశ్వర్ వేన్ దిగి, నా దగ్గరికి వచ్చాడు.

"డాక్టర్ శ్రీధర్‌ను మీరెంత కాలంగా ఎరుగుదురు?" అడిగాడు.

"దాదాపు ఆయిదేళ్ళుగా," అన్నాను.

"మీరే పనిమీద మధ్యాహ్నం ఆయన్ని కలుసుకోవాలని వచ్చారో - నే తెలుసుకోవచ్చా?"

"తప్పకుండా....ప్రస్తుతం నేనొక బీమా కేసుమీద పనిచేస్తున్నాను. ప్రతివాదుల తరపున అనుభవజ్ఞులైన డాక్టర్లు రేపు కోర్టులో హాజరు కాబోతున్నారు. వారితో నేను వాదించాలంటే, నాకుకూడా వైద్యశాస్త్రానికి సంబంధించిన కొన్ని విషయాల గురించి తెలిసి ఉండడం అవసరంగా? ఈ విషయంలో డాక్టరు శ్రీధర్ నాకు అప్పుడప్పుడు తోడ్పడుతున్నారు. ఈ వేళ మధ్యాహ్నంకూడా ఆ పనిమీదే ఆయన్ని కలుసుకోడానికి వచ్చాను."

"సరే....అసలు విషయానికి వద్దాం... ఆ ప్రమాదం జరిగాక ఆ బ్యూక్ కారు డ్రయివరు బ్రేక్ వేయలేదుగా? కనీసం, ఏం ఘోరం జరిగిందోనని కూడా చూడడానికి ప్రయత్నించ లేదన్నమాట?"

''అవును....పైగా, తన కారు వేగాన్ని మరింత హెచ్చించాడు."

"ఎంత దారుణం!"

"బహుశ, అతనికి గుండె తారెత్తిపోయి ఉంటుంది."

"అయినా, ఇంత అన్యాయమా? ఇంతకీ అతని గురించి మీరేమీ చెప్ప లేరన్న మాట?"

"చెప్పా కదండీ అతన్ని సరిగా చూడలేక పోయానని? ఆ బ్యూక్ కారు స్టీరింగ్ ముందు ఒక మానవాకారం ఉందని తప్ప - అంతకన్నా నేనింకేం చెప్పలేను!"

"సరే....ప్రస్తుతానికి మీ ద్వారా మేం తెల్సుకోవాల్సిన విషయాలు ఇంతే– చాలా థాంక్సండి. మీకు శ్రమ ఇచ్చాను. మిమ్మల్నిక్కడే ఇంతవరకు ఆపు చేసి, మీ అమూల్యకాలాన్ని వృధాపరచి ఉంటాను. కాని, నా వృత్తిరీత్యా తప్పదుగా?" అని చిరునవ్వుతో ఇన్‌స్పెక్టరు ఈశ్వర్ నా వద్ద సెలవు తీసుకొని, వేలిముద్రల నిపుణుడితో, ఫొటోగ్రాఫర్‌తో ఏదో మాట్లాడ్డానికి వెళ్లగానే, నేను ఉస్సూరుమంటూ ఒక కుర్చీలో కూలబడ్డాను.

ఒకసారి చుట్టూ చూశాను. రోగులను పరీక్షించే బల్ల, ఎక్స్‌రే యంత్రం, స్టెరిలైజర్, బ్లడ్ ప్రెషర్ గేజ్, మందుల బీరువా, మరికొన్ని నేనెరుగని పరికరాలు ఆ హాలులో చుట్టూ ఉన్నాయి. నా ముందు శ్రీధర్ కూర్చునే రివాల్వింగ్ కుర్చీ వెలవెలబోతూ కనిపించింది.

డాక్టర్ శ్రీధర్‌కు దాదాపు 35 ఏళ్ళుంటాయి. దృఢకాయుడు. స్ఫురద్రూపి అనికూడా చెప్పాలి. జుట్టు ఏమంతగా నెరసిపోలేదు కాని, నుదుటిమీద ముడుతలు వైద్యవృత్తిలో అతనికున్న విశేషమైన అనుభవాన్ని తెల్పుతాయి. మంచి హస్తవాసిగల డాక్టరు అనికూడా పేరు పొందాడు. ఐతే, ఒక విషయం మాత్రం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తూంటుంది. ఇంత ప్రాక్టీసు ఉండికూడా అతను అవివాహితుడుగా ఎందుకు ఉండిపోయాడా అని. ఆ విషయం గురించి అతన్ని ఒకటి రెండుసార్లు అడిగాను కూడా. మొదటి దఫా నవ్వి ఊరుకున్నాడు. రెండోమారు "పుట్టిన ప్రతివాడూ పెళ్ళి చేసు కొని తీరాలేమిటి? ఐనా, నేనింకా పెళ్ళీడు దాటలేదుగా? ఎప్పుడో ఒకప్పుడు చేసుకుంటాలే...కాని, చేసుకున్నాక ఇప్పటిలా నేను రోగులకు సేవ చేయలేనేమోనని నా భయం," అనేసి వెంటనే ఆ ప్రస్తావన ఆపి, లోకాభిరామాయణంలోకి నన్ను దింపాడు. దాన్నిబట్టి అతని వివాహ ప్రసక్తిని పదే పదే తీసుకురావడం అతనికి ఇష్టం లేదేమో అనిపించింది నాకు. ఆ తర్వాత ఆ విషయం గురించి అడగడం మానేశాను కూడా.

ఉన్నట్టుండి పొడిదగ్గు వినిపించింది. తృళ్ళిపడి పక్కకు తిరిగాను.

నర్సు రీటా నిలుచొని ఉంది. సన్నటి నడుము, చక్కని వొంపులు స్పష్టంగా అగుపించేలా వొంటికి అంటుకొనిపోయి ఉన్న తెల్లటి దుస్తులు, కోల ముఖం, కొనదేరిన ముక్కు, తీర్చిదిద్దినట్లుండే కనుబొమలతో ఆకర్ష ణీయంగా కనిపించే నర్సు రీటాను ఇప్పుడు విషాదఛాయలు అలుముకొని ఉండగా చూడలేక పోతున్నాను. ఎప్పుడూ కనిపించే చిరునవ్వు ఆమె పెదవులమీద ఇప్పుడెలా ఉంటుంది?

"నాకేం చేయాలో తోచకుండా ఉంధండి....నే వొక్కతెనే...." ఆ తర్వాత వాక్యం పూర్తి చేయలేక పోయిందామె.

"ఇప్పుడా విషయాలేం మనం మాట్లాడుకోకూడదు. మీ డాక్టర్‌గారికి లాయర్ని నేనేగా? అంచేత, నువ్వేం ఆలోచించనక్కర్లేదు. నీకేం ఫరవా లేదు. పోలీసువారి తతంగమంతా ముగిశాక నే చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. ముఖ్యంగా డాక్టరు శ్రీధర్ ఆస్తిపాస్తుల విషయమై ఎన్నో వివరాలు సేకరించాలి. నే చెప్పేవరకు నువ్వు ఇక్కడే ఉండు. ఈ డిస్పెన్సరీలో డాక్టరుగారి ఫైల్సు ఏవైనా ఉంటే రేపు నాకోసారి చూపించు. పైగా, ఈవేళ రాత్రివరకు పేషెంట్స్ ఇక్కడికి వస్తూంటారుగా? వాళ్ళతో ఏదో ఒకటి చెప్పి పంపించడానికి ఇక్కడ ఎవరో ఒకరు ఉండాలికదూ? అంతే కాదు; రేపట్నించి డాక్టరు శ్రీధర్ మూలంగా మృత్యుముఖంనించి బయట పడ్డ మాజీ రోగులు, డాక్టరు అభిమానులు, మిత్రులు ఇలా ఎందరో వారి వారి విచారాల్ని అందజేయడానికి ఇక్కడికి వస్తూంటారు. ఆ సానుభూతి పల్కులను నువ్వే స్వీకరించాలి. అంచేత, నీ బాధ్యత ఇప్పుడప్పుడే తీరిపోలేదు. అసలు ప్రస్తుతం నీ నివాసం ఈ కాంపౌండ్‌లోని ఔట్ హౌస్ లోనేగా? ఇక్కడే ఉండి, ఈ డిస్పెన్సరీని చూసుకుంటూండు. ఆ తర్వాత నీ సంగతి గురించి ఆలోచించవచ్చు." అని నేను అంటూండగా పక్క గదిలోంచి "రీటా" అన్న పిలుపు హీనస్వరంలో వినిపించింది. ఆ స్త్రీ కంఠం — డాక్టరు శ్రీధర్ కారుకు బలి అయిన తర్వాత నర్సు రీటాతోపాటు వరండా లోకి వచ్చిన ఆ ఆంగ్లోఇండియన్ వనితది కాబోలు....ఆమె డాక్టరుగారి పేషెంట్ అయిఉండాలి.

"ఎవరో నిన్ను పిలుస్తున్నారు; వెళ్లు." అన్నాను.

నర్సు రీటా మౌనంగా పక్కగదికేసి భారంగా అడుగులు వేస్తూ వెళ్ళి పోయింది.

రీటాకు పెళ్ళికాలేదు. డాక్టరు శ్రీధర్‌కూడా బ్రహ్మచారి. ఆమెను "సిస్టర్!" అని పిలుస్తూండేవాడు. అలా సోదరభావంతో ఉండడంవల్లే వాళ్ళిద్దరూ కలిసి రోగులకు అంతగా సేవచేస్తూ వచ్చారు. 'ఎంత మహత్తర మైన సేవ,' అనుకుంటూ కుర్చీలోంచి లేచాను.

*　　　　*　　　　*

రాత్రి తొమ్మిది దాటాక ఒక పొడుగాటి కవరును బీరువాలోంచి తీసి, వాలుకుర్చీలో కూర్చున్నాను. ఆ కవరులో టైప్‌చేసిన కాగితాలు ఉన్నాయి. నెల రోజులక్రితం డాక్టరు శ్రీధర్ పాపం, ఒక రాత్రంతా నిద్రపోకుండా కూర్చొని, ఆ కాగితాలను టైప్ చేసి ఇచ్చాడు. అందులో చేతి ఎముకల నిర్మాణం గురించి డాక్టరు శ్రీధర్ ఎంత విపులంగా తెలియజేశాడని? ఆయన ధర్మమా అని అప్పుడు ఒక కేసులో కూడా నేనే గెలిచాను.

ఇప్పుడా కాగితాలలో డాక్టరు శ్రీధర్ ముఖమే గాయాలతో కనిపిస్తోంది.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగడంతో నా ఆలోచనల్లోంచి తేరుకున్నాను. మెల్లగా వెళ్ళి, వీధి తలుపు తీశాను. ఎదురుగా డాక్టర్ శ్రీధర్ మేనకోడలు కుమారి నిలుచొనుంది.

ఆమెకు దాదాపు 20 ఏళ్ళుంటాయి. మిసమిసలాడే దేహచ్ఛాయ.... అప్సరస అనడం అతిశయోక్తి అవుతుందేమోగాని మంచి అందకత్తె అనే చెప్పాలి. ఎప్పుడూ కిల కిల నవ్వే పెదవులతో, మిలమిల మెరిసే కళ్ళతో,

కళకళలాడే ఆమె ముఖం ఇప్పుడామె మామ శ్రీధర్ హఠాన్మరణం గురించి విన్నాక మరీ ఇంత విరుద్ధంగా మారిపోవడం నాకు కాస్త ఆశ్చర్యాన్ని కలిగించక పోలేదు.

"ఏమిటమ్మాయ్ ? ఇలా వచ్చావ్ ? రా లోపలికి," అన్నాను.

ఆమె బరువుగా అడుగులు వేస్తూ హాల్లోకి వచ్చి నిలుచుంది. ఏదో చెప్పబోయింది. కాని, పెదవులు తడబడ్డాయి.

"ఏమిటమ్మాయ్ ?"

ఆమె కనుకొలకుల నీళ్ళు నిలిచాయి.

నేను బరువుగా నిట్టూరుస్తూ, "మీ మామయ్య— అందులో ఇలాంటి దుర్మరణం పాలవడం—నీకే కాదు ; ఎవరికైనా చాలాకష్టంగానే ఉంటుంది." అన్నాను.

"చనిపోయిన వారి గురించి ఏడిస్తే ప్రయోజనం లేదని నాకు తెలుసు. ఆ దుఃఖంలోంచి తేరుకోడానికి ఎక్కువ కాలం పట్టదు...." బొంగురు పోయిన కంఠంతో అంటూ, ఆమె తల వొంచుకుంది.

"మరి ?" ఆమెవైపే రెప్పలార్పకుండా చూస్తూండి పోయాను.

"సజీవంగా ఉన్నవారి గురించే ఇప్పుడు నా విచారం...."

"అంటే ?" నొసలు చిట్లించాను.

"ఇప్పుడు నా భర్త...."

"ఊఁ.... నీ భర్త ? ఏమిటి ? బాబ్జీకి ఏమైందమ్మా ?"

"అరెస్టయ్యారు."

"అరెస్టా ! ఎందుకు ?"

"గంటక్రితం ఇద్దరు పోలీసులు మా ఇంటికి వచ్చారు. మామయ్యను చంపింది మా వారే నట. ఉద్దేశ్యపూర్వకంగానే మామయ్య మీదికి కారును పోనిచ్చారని వారిని తీసుకెళ్ళిపోయారు."

"అంటే, నెలక్రితం మీ మామయ్య మీ కొక కారును కొనిచ్చాడని విన్నాను. అది బ్యూక్ కారా ?"

"అవునండి."

"నీలం రంగుదా ?"

"ఆఁ."

"1956 మాడల్....?"

"మరేనండి."

"టయర్లకు అంగుళంమేర చుట్టూ గుండ్రంగా తెల్లటి పెయింట్ వేసి ఉంటుంది ?"

"అది మా కారేనండి."

కుప్పలా నా వెనుకనున్న కుర్చీలో కూలబడిపోయాను. "కూర్చో, అమ్మాయ్ ! నిలుచున్నావేం ?" అన్నాను.

కళ్ళు తుడుచుకుంటూ, ఆమె నా ఎదురుగా సోఫాలో కూర్చుంది.

"ఆ పోలీసువారు నీ భర్తను ఏవైనా ప్రశ్నలు అడగలేదూ ?"

"ఆఁ.... డాక్టర్ శ్రీధర్‌గారిని మా వారు ఎరుగుదురా అని అడిగారు ముందు. ఆ ప్రశ్నకు నేనే సమాధాన మిచ్చాను— ఆయన మా మామయ్య అని. అటుపైన, ఈ రోజు మధ్యాహ్నం నాలుగుగంట లప్పుడు ఎక్కడున్నారని మా వారిని అడిగారు. ఆఫీసులోనే ఉన్నానని వారు జవాబిచ్చారు. ఆఫీసువిడిచి ఎక్కడికీ వెళ్ళలేదా అంటే, అప్పుడు ఎక్కడికీ వెళ్ళలేదన్నారు. ఆ తర్వాత వాళ్ళు నా వైపు తిరిగి, 'మీకు కారు డ్రయివింగ్ వచ్చా ?' అని అడిగారు. రాదన్నాను. 'సరే.... ఇప్పుడు మీ ఇంటిముందు ఆపిఉన్న మీ బ్యూక్ కారును మేము చూశాం. ప్రత్యక్ష సాక్ష్యం మూలంగా మేము మిమ్మల్నిప్పుడు అరెస్ట్ చేయవలసి వస్తోంది. మాతోపాటు హెడ్‌క్వార్టర్స్‌కు మీరు రావాలి.' అంటూ మా వారిని వాళ్ళ జీప్‌లో తీసుకెళ్ళిపోయారండి. వారితోపాటు నేనూ వస్తానంటే— వీల్లేదన్నారు. అప్పుడే మీ కోసం ఫోన్ చేశాను. మూడుసార్లు మీ నెంబర్‌ను డయల్ చేసినా ఇక్కడ రిసీవర్‌ను ఎవరూ ఎత్తుకున్నట్లు లేదు."

"నేను ఇక్కడికి వచ్చి అరగంటే అయింది. పైగా, ప్రస్తుతం ఇంట్లో ఎవరూ లేరుకూడ...." అన్నాను.

"నా కేం చేయడానికీ తోచలేదు. ఉదయంనించి నా కుడికన్ను అదురుతూంటే, ఏం ముప్పు వాటిల్లబోతూందో అని భయపడుతూనే ఉన్నాను. కాని, ఒకటి కాదు; రెండు . నాకు 'నా' అని చెప్పుకోదగ్గ మామయ్య ఈ రోజే అకాలమృత్యువుకు బలిఅయ్యాడు....మా వారిని పోలీసులు తీసుకెళ్లిపోయారు. ఇక, ఆ కొంపలో ఒంటరిగా నేనెలా ఉండను ? మిమ్మల్ని నేరుగా కలుసుకోడానికి వీలవుతుందేమో నని ఇలా బయలుదేరి వచ్చాను. ఏమండీ .." అంటూ ఆ యువతి ఇంకా ఏదో చెప్పబోయింది. మా మామయ్యంటే ఎంతో భక్తి, గౌరవమున్నూ. అలాంటిది...."

ఇంతలో నా పక్కన టీపాయ్ మీదున్న టెలిఫోన్ బెల్ మోగింది. రిసీవర్‌ను అందుకొని, "ఎస్....అడ్వకేట్ అశోక్ హియర్...." అన్నాను.

"నేను— ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌నండి. ఇంత రాత్రిలో మీకు శ్రమ ఇస్తున్నందుకు మన్నించాలి. ఆ కారును మీరు గుర్తుపట్టడానికి దయచేసి వెంటనే మా హెడ్‌క్వార్టర్సుకు రాగలరా ?"

"అలాగే."

"మీ కోసం మా జీప్‌ను పంపిస్తాను."

"అక్కర్లేదు. నేనే ఏ టాక్సీ మీదో బయలుదేరి వస్తాలెండి. ఇంకో ఇరవై నిమిషాలలో అక్కడ ఉంటాను." అంటూ రిసీవర్‌ను హుక్ మీద ఉంచి, "పద, కుమారీ....నీ భర్తను నువ్వు కలుసుకునే ఏర్పాటు చేస్తాను," అన్నాను.

చివాలున ఆమెలేచి నిలుచుంది.

ఇద్దరం టాక్సీలో బయలుదేరాం. వెనుక సీటులో కుమారి నా పక్కన తల వొంచుకొని కూర్చొనుంది. ఏదైనా కబుర్లలోకి దింపి, ఆమె మనో వేదనకు ఉపశమనం కలిగించా లనుకున్నాను.

"అది సరే...మీరు మీ మామయ్య ఇంట్లోనే ఉండకుండా వేరేగా ఎందుకు వుంటున్నారు ?"

"మా వారికి అక్కడ ఉండడానికి ఇష్టంలేదు. పైగా.... చిన్నప్పుడు మా అమ్మా, నాన్న పోయినప్పట్నించి నన్ను పోషించే భారం మామయ్య మీద పడింది. నాకు విద్యాబుద్ధులు చెప్పించారు. వివాహం జరిపించారు. ఇటీవలే మా కోసం ఆ బ్యూక్‌కారు కొన్నారుకూడ. ఇంకా ఎంతకాలమని మామయ్యకు శ్రమ కలిగించను ?"

"మీ మామయ్యా, మీ వారూ చనువుగా ఉంటారా ?"

"మా వారు మితభాషి. పైగా మామయ్య నాతో తప్ప— మరెవ్వరితోనూ అంత చనువుగా ఉండరు నాకు తెలిసినంతవరకు...."

"మామయ్య అప్పుడప్పుడు మీ ఇంటికి వచ్చేవారా ?"

"ఆఁ.... వారానికి ఒకసారి.... ప్రతి ఆదివారం మధ్యాహ్నం మా ఇంట్లోనే భోంచేసేవారు. నా చేతి వంట అంటే మామయ్యకు చాలా ఇష్టం."

డాక్టర్ శ్రీధర్‌కు కుమారిపట్ల ఎంత వాత్సల్యం ఉండేదో నాకు బాగా తెలుసు. ఆయన వీలునామాలో తన తదనంతరం తన ఆస్తి యావత్తూ కుమారికి చెందాలని నా చేత రాయించడమే అందుకు తార్కాణం.

"ఇప్పుడీ కుమారి ఒక గొప్ప ఆస్తికి వారసురాలు కాబోతుందన్న మాట ?'' అనుకుంటూ, మళ్ళీ ఆమెవైపు తిరిగాను.

"ఏమండీ, నిష్కారణంగా పోలీసువారు మా వారిని ఎందుకు అనుమానించారు ? ఎంత అన్యాయం ?" అందామె.

ఆమె ప్రశ్నకు తగు సమాధానం చెబితే, ఆ స్థితిలో ఆమె నెత్తిన బాంబు పడ్డట్లు అవుతుందని నాకు తెలుసు. కాని, ఆమె సంశయాన్ని నివృత్తి చేయకుండా ఎలా ఉండగలను ? అంచేత, డాక్టర్ శ్రీధర్ రాయించిన వీలునామా ప్రకారం ఆయన ఆస్తిపాస్తులంతా ఆమెకు సంక్రమించబోతోందన్న విషయాన్ని ఆమె గుర్తుకు తేగానే– నేననుకున్నట్లే ఆమె దిగాలుగా ముఖం పెట్టేసింది.

* * *

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మేమిద్దరం మేడమీదికి వెళ్లాం. అక్కడ వరండాలో నడుస్తూండగా– టైప్‌మిషన్ చప్పుడు వినిపిస్తున్న ఓ గదిముందు ఒక మధ్యవయస్కుడు బల్లమీద కూర్చొనుండడం చూశాను. కుమారిని చూడగానే అతను లేచివచ్చి, "శ్రీమతి బాబ్జీగారూ ! ఎంత అన్యాయం ? ఏదో పొరబాటు జరిగిఉండాలి. అంతే.... మీరేమీ ఆందోళన చెందకండి. త్వరలోనే నిజానిజాలు బయటపడి, అంతా చక్కబడుతుంది. మీ వారికి తప్పకుండా విడుదల లభిస్తుంది. అసలు బాబ్జీగారి అరెస్ట్ గురించి విన్నాక మొదట నమ్మలేకపోయాను. వెంటనే మీ ఇంటికి ఫోన్ చేశాను. మీరు ఇంట్లో లేరని మీ నౌకరు చెప్పాడు. సరే.... ఏ లాయర్‌నో చూడడానికి మీరు వెళ్ళిఉంటారనుకున్నాను,'' అన్నాడు.

"వీరే మా లాయరు.... అశోక్‌గారు,'' అంటూ నా వైపు చూపించి, "వీరు మిస్టర్ ప్రభు.... మా వారు పనిచేస్తున్నది వీరి కంపెనీలోనే," అంది అతన్ని నాకు పరిచయం చేస్తూ.

మేమిద్దరం కరచాలనం చేసుకున్నాం.

మిస్టర్ ప్రభుకు యాభై ఏళ్ళు ఉంటాయేమో ! పీలగా ఉంటాడు. ఆయన పేరుమోసిన బిల్డింగ్ కంట్రాక్టర్ అన్న విషయం నాకు తెలుసు.

"మీ గురించి నేను చాలా విన్నాను. మీతో పరిచయ భాగ్యం లభించినందుకు ధన్యుడ్ని,'' అన్నాడు మిస్టర్ ప్రభు.

"నేను కూడా..." అని చిరునవ్వుతో "బాబ్జీ మిమ్మల్ని ఇక్కడికి రమ్మని కోరాడా ?" అని అడిగాను.

"లేదండి," అని మిస్టర్ ప్రభు అడ్డంగా తల తిప్పి, "మధ్యాహ్నం నాలుగున్నర ప్రాంతంలో నేను ఒక పనిమీద వెళ్లి ఆఫీసుకు తిరిగి వచ్చాను. అర్జంట్‌గా పోస్టు చేయాల్సిన ఉత్తరాల మీద సంతకాలు పెట్టడానికి. మధ్యాహ్నమంతా ఆఫీసులోనే ఉన్నట్లు అప్పుడు బాబ్జీ నాతో చెప్పాడు. తతిమ్మా గుమాస్తాలు ఎవరూ లేరు గనుక ఆ ఉత్తరాలను నేనే పోస్ట్ చేయడానికి తీసుకెళ్లి, ఆ తర్వాత మళ్ళీ నా పనిమీద ఒక చోటికి వెళ్లాన్ను. సాయంత్రం ఆరు వరకు తను ఆఫీసునించి కదల లేదని బాబ్జీ పోలీసులతో అన్నాడట. ఆ విషయం ఎంత మాత్రం నిజమో తెలుసుకునేందుకు పోలీసువారు అరగంట క్రితం నన్నిక్కడికి రమ్మని కోరారు. అప్పుడే ఇంటికి వచ్చిన వాడ్ని దుస్తులైనా మార్చుకోకుండా ఎకాయెకిన ఇక్కడికి బయలుదేరి వచ్చాను.''

"పోలీసువారితో మీ రేం చెప్పారు. ?'' వెంటనే అడిగాను.

మిస్టర్ ప్రభు నిట్టూరుస్తూ, "ఈ వేళ మధ్యాహ్నమంతా నేను మా కంపెనీలోనే ఉండడానికి వీల్లేకపోయిందని చెప్పాగా ? మూడు గంటల ప్రాంతంలో ఒక పనిమీద ఆఫీసు వదలి బయటకు వెళ్లానా...?" అని ఇంకా ఏదో చెప్పబోయేలోగా, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ మాకు ఎదురయ్యాడు. "ఓ...అప్పుడే వచ్చేశారే. రండి సార్ !'' అంటూ నన్ను ఒక గదిలోకి తీసుకెళ్లాడు. కుమారి నన్ను అనుసరించింది.

ఆ గదిలో మోచేతుల్లో తలదాచుకొని, బాబ్జీ ఒక బల్లమీద కూర్చొని ఉన్నవాడల్లా మా అడుగుల చప్పుడు విని, తల ఎత్తాడు.

"హలో, బాబ్జీ !'' అని పలకరించాను. అతను నాకు నమస్కరిస్తూ లేచి నిలుచున్నాడు. "కూర్చో....నువ్వేం విచారించకు'' అని నేనతనికి ధైర్యం చెబుతుండగా, "ఇతన్ని మీరు గుర్తుపట్టగలరా ?'' అడిగాడు ఇన్‌స్పెక్టరు ఈశ్వర్.

"ఓ....ఇతనిపేరు బాబ్జీ...." అన్నాను.

నా ఉద్దేశ్యం అదికాదండి.... డాక్టరు శ్రీధర్ మృత్యువుకు కారణమైన బ్యూక్ కారును నడుపుతున్న వ్యక్తి ఇతనేనేమో మీరు పోల్చుకోగలరా ?"

"అప్పుడు నేనా కారును నడుపుతున్నతని ముఖాన్ని చూడలేదని మీకు స్పష్టంగా చెప్పానే ?"

బాబ్జీ తలవొంచుకొని, "నే నే పాపం ఎరగను. మధ్యాహ్నం నాలుగు గంటలప్పుడుకూడా నేను ఆఫీసులోనే ఉన్నానండి, అశోక్‌గారూ ! నామాట నమ్మండి'' అన్నాడు.

నేను ఈశ్వర్‌వైపు తిరిగి, "ఇంతకీ ఆ బ్యూక్‌కారు ఇతనిదేనని మీరు దృఢంగా చెప్పగలరా ?" అన్నాను.

"ఆఁ....మీరు చెప్పిన ఆ కారు గుర్తులు సరిగ్గా సరిపోయాయి. పైగా, అప్పుడు డాక్టరు శ్రీధర్ కోటు తాలూకు రెండు ఉలెన్ పోగులు ఆ కారు హెడ్‌లైట్లు పగిలిన గాజుముక్కలకు చిక్కుకొని ఉండడం మా పోలీసు లేబరేటరీలోని నిపుణులు పోల్చుకున్నారు. ముందు టయర్లకు అక్కడక్కడ రక్తం మరకలు అంటుకొని ఉన్నాయి. ఆ రక్తం డాక్టరు శ్రీధర్ శరీరానికి సంబంధించినదే అనికూడ రసాయనిక పరీక్షలవల్ల తేలిపోయిందండి."


బాబ్జీ తల ఎత్తాడు. "అన్యాయంగా నా నెత్తిన ఆ నేరాన్ని అంటగట్టాలని చూస్తున్నారు" అని మళ్ళీ బావురుమన్నాడు.

అతని భుజంమీద తడుతూ, "నువ్వేం భయపడకు. నీ తరపున నేను లాయరుగా పనిచేస్తున్నాను. నీ భార్య ఆ బాధ్యతను నాకు అప్పగించింది" అన్నాను.

అతని తరపున మీరెలా లాయరుగా పనిచేస్తారు ? ఆ ప్రమాదం జరిగినప్పుడు కళ్ళారాచూసిన సాక్షి మీరొక్కరే. ప్రాసిక్యూషన్ తరపున మీరు సాక్ష్యమివ్వాలిగా ? ముద్దాయి తరపున ఎలా మీరు వాదించగలరు ?" అన్నాడు ఇన్‌స్పెక్టరు ఈశ్వర్.

నిజమే....ఐతే, నా సాక్ష్యం ఆ వాహనాన్నేకాని, దాని డ్రయివరును గుర్తుపట్టడం వరకు కాదు.

ఉన్నట్టుండి నా మెదడులో ఏదో మెరుపులా మెరిసింది. బాబ్జీ తన బ్యూక్ కారును ఆఫీసు బయట ఎక్కడో ఆపుజేసి ఉంటాడుగా ? అప్పుడతనికి తెలీకుండా దాన్ని ఎవరైనా తీసుకెళ్ళి, డాక్టరు శ్రీధర్ మరణించాక మళ్ళీ దాన్ని తెచ్చి, అక్కడ యథాస్థానంలో ఉంచొచ్చుగా ? అప్పుడా వ్యక్తి ఏదైనా పొరబాటు చేయడానికి అవకాశముంది.



## రంగుల మామయ్యా

"చూడు, బాబ్జీ! మధ్యాహ్నం నువ్వు ఆఫీసులో ఉండగా—కారు ఎక్కడ పార్క్ చేయబడి ఉంది?" అని అడిగాను.

"మామూలులాగే - మా ఆఫీసు బయట రోడ్డుమధ్య ఆపాను. అది పార్కింగ్ స్టాండ్" అన్నాడు బాబ్జీ.

"సాయంత్రం నువ్వు ఇంటికి బయలుదేరేటప్పుడు అది ఆ స్థానంలోనే ఉందా?"

బాబ్జీ నా వంక విచిత్రంగా చూశాడు. "అక్కడే ఎందుకుండదండి? కారు బీగాలు నావద్దే ఉన్నాయిగా?"

"ఆ బీగాలను ఎక్కడ ఉంచుకున్నావ్?"

"నా కోటులోనే."

"ఆఫీసులో ఉన్నంతసేపూ నువ్వు కోటును తొడుక్కునే ఉన్నావా?"

"బ్లూ ప్రింట్స్ తయారు చేసేటప్పుడు నేను సాధారణంగా కోటునుతీసి, స్టాండ్‌కు తగిలిస్తూంటాను."

"ఐతే, మధ్యాహ్నం ఎన్ని గంటలకు కోటును తీసేశావ్"

"సరిగ్గా టయిమ్ చెప్పలేను. మధ్యాహ్నం లంచ్‌కు వెళ్లేముందు - అంటే, దాదాపు రెండున్నర ప్రాంతంలో కోటును విప్పి, స్టాండ్‌కు తగిలించాను."

"అక్కడ్నించి దాన్ని తీసి, మళ్ళీ ఎప్పుడు తొడుక్కున్నావ్?"

"సాయంత్రం ఆరు గంటలప్పుడు - ఇంటికి బయలుదేరడానికి ముందు."

"అప్పుడు నీ కారు హెడ్ లైట్ల అద్దాలు కొంత భాగం విరిగిపోయినట్లు నువ్వు గుర్తించలేదా?"

"అప్పుడలా గుర్తించాల్సిన అవసరం ఏముందండి? మామూలుగా కారు తలుపుతీసి లోపల కూర్చొని, స్టార్ట్ చేశాను. ఇల్లు చేరుకునేదాకా చీకటి పడలేదు. అంచేత హెడ్‌లైట్లు వెలిగించ లేదు. లేకపోతే, హెడ్‌లైట్లు అద్దాలు పగిలినట్లు అప్పుడే గుర్తించి ఉండేవాడ్నేమో! ఇంటికి చేరుకున్నాక కూడా కారును మామూలులా షెడ్‌లో ఉంచి, నా గదిలోకి వెళ్లాను."

"మరి, నువ్వు సాయంత్రం ఆరుగంటలదాకా మీ ఆఫీసులోనే ఉన్నట్లు నీ ఎలిబీని రుజువు చేయడానికి మీ ఆఫీసులో ఎవరూ లేరా?"

"మా కంపెనీ అధినేత ప్రభుగారు మధ్యాహ్నం ఒకటి రెండుసార్లువచ్చి, కొన్ని నిమిషాలపాటు ఉండి వెళ్ళిపోయారు. వారి సెక్రెటరీ సెలవుమీద ఊరికి వెళ్ళింది. అక్కౌంటెంటు ఫ్లూ జ్వరంవల్ల రావడం లేదు. ఒక గుమాస్తా ఆఫీసు పనిమీద బెంగుళూరు వెళ్ళాడు. ప్యూను ఈ వేళ ఎందుకు పనికి రాలేదో తెలీదు. అంచేత, నేనొక్కడ్నే ఆరుగంటలదాకా ఉండి పోవలసి వచ్చింది అందరి పనులు చూస్తూ."

ఇన్‌స్పెక్టరు ఈశ్వర్ బాబ్జీ ఎదురుగా వచ్చి నిలుచున్నాడు. "ఇటీవల మీరు ఆర్థికంగా బాధపడుతున్నారా?" అని అడిగాడు.

ప్రభు ముఖం చిట్లించాడు. "నాకేం ఖర్మ? ఆ సందేహం మీ కెందుకు కలిగింది? నేను మంచి ఉద్యోగంలో లేనా?"

"కాని, మీ భార్యగారికి త్వరలోనే బోలెడంత ఆస్తి రాబోతోంది. ఆమె మేనమామ డాక్టర్ శ్రీధర్ ఆస్తికి ఆమే వారసురాలని మీ రొకప్పుడు ఏదో మాటల సందర్భంలో మీ ప్రొప్రయిటరు మిస్టర్ ప్రభుతో అన్నా

రటగా ? ఇప్పుడు ఎంత శీఘ్రగతిని ఆమెతోపాటు మీరుకూడా ధనవంతులు కాబోతున్నారు !"

బాబ్జీ ముఖం జేవురించింది. "పాపిష్టి డబ్బుకోసం ఒక నిండుప్రాణాన్ని అన్యాయంగా తీసేంతటి నీచుడ్ని కాదు" అన్నాడు.

"కాని, కేసు నీ మీదే బలపడిపోయింది. హత్యకు కారణం, హత్య చేయడానికి అవకాశాలు తేటతెల్లమయ్యాయి. కోర్టులో ఎటూ అన్ని విషయాలూ తప్పకుండా బయటపడతాయి. కాని, ఇప్పుడే నేరాన్ని ఒప్పేసుకుంటే, మాకు లేనిపోని శ్రమను తప్పించి, మేలు చేసినవాడి వౌతావు."

ఇన్‌స్పెక్టరు ఈశ్వర్ తొందరపడి మాట్లాడేస్తున్నాడు. అంచేత వెంటనే నేను అడ్డుపడక తప్పిందికాదు. "బాబ్జీ....నువ్వు చెప్పవలసిందేదో వారికి చెప్పావు. ఇక నోరు మెదపకు" అంటూ ఈశ్వర్ వైపు తిరిగి, "ఇతను నా క్లయింటు. ఇతని తరఫున నేను మాట్లాడ్తా'' అన్నాను.

దాంతో ఈశ్వర్ ఇక ఏం మాట్లాడగలడు ? నాకేసి గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు.

ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాను....డాక్టరు శ్రీధర్‌లాంటి ఉత్తముడికి శత్రువు లెవరైన ఉంటారేమో అనుకోడానికి ఏ మాత్రం ఆస్కారం లేదు. మరి, అతన్ని ఎవరు, ఎందుకు హత్య చేసినట్లు ? ఆయన డిస్పెన్సరీలో పనిచేసే నర్సు రీటాను ఒకసారి కలుసుకుంటే ఈ 'మిస్టరీ'ని ఛేదించడానికి తోడ్పడే విషయాలేవైనా బయటపడగలవేమో – అనిపించడమే తడవుగా వెనుతిరిగాను. "అమ్మాయ్, కుమారీ ! నువ్విక్కడే ఉంటావా ? నీ భర్తతో ఇప్పుడు నువ్వు ఏకాంతంగా మాట్లాడుకోడానికి ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌గారు ఏమీ అభ్యంతరం చెప్పరనుకుంటాలే....నా కొక చిన్న పనుంది. అర్జంట్‌గా వెళ్ళాలి. అరగంటలో వచ్చేస్తా. అటుపైన నీ భర్తను బెయిల్‌మీద వెంటనే విడుదల చేయించే ఏర్పాటు చేస్తా'' అంటూ అక్కడున్న అందరివద్దా సెలవు పుచ్చుకొని, ఆ గదిలోంచి బయటకు నడిచాను.

వరండాలో మిస్టర్ ప్రభు నాకు కనిపించి, చిరునవ్వుతో "బాబ్జీతో మీరు మాట్లాడారల్లే ఉందే ! నేనతనితో కొన్ని ఆఫీసు విషయాల గురించి మాట్లాడాలి. అందుకే ఇందాకట్నించి ఇక్కడ కాచుకొనిపడున్నాను.'' అన్నాడు జేబులోంచి కర్చీఫ్‌ను తీసి, ముఖంమీద స్వేదబిందువులు తుడుచుకుంటూ.

ఆ జేబురుమాలుమీదే నా దృష్టి నాకు తెలీకుండానే నిమిషంపాటు నిలిచిపోయింది. నా మెదడులో ఎవరో టార్చ్‌లైట్ వెలిగించినట్లయింది.

మిస్టర్ ప్రభు ముఖం తుడుచుకున్నాక రుమాలును జేబులో పెట్టుకునేలోగా, "వస్తానండీ...మళ్ళీ కలుస్తా...అర్జెంట్ పనుంది" అంటూ అతని సమాధానానికి ఎదురు చూడకుండానే వడివడిగా నడక సాగించాను.

టాక్సీలో మరో అరగంటకల్లా మిస్టర్ ప్రభు ఆఫీసు దగ్గరికి చేరుకున్నాను. ఆ ఆఫీసుముందు కారులు ఆపడానికి కేటాయించిన స్థలం రోడ్డు మధ్యగా ఉండడం గమనించాను. ఎదురుగా ఏదో పార్కు ఉంది. అంచేత, బాబ్జీ అక్కడ ఆపిన అతని బ్యూక్ కారును మరెవరైనా అతనికి తెలీకుండా తీసుకెళ్ళి, తమ పని ముగిశాక, మళ్ళీ దాన్ని తెచ్చి అక్కడ ఉంచుతూండగా అప్పుడు రోడ్డుమీదున్న ఇతరు లెవరైనా గమనించారో - లేదో కనుక్కోవడం కష్టమే.

అక్కడ్నించి డాక్టరు శ్రీధర్ డిస్పెన్సరీకి చేరుకున్నాను. నర్సు రీటా నాకు వరండాలోనే ఎదురైంది. అంతరాత్రిలో ఆకస్మాత్తుగా నేనువచ్చినందుకు ఆమెకు ఎంతైనా ఆశ్చర్యం కలిగినట్లు విప్పారిన ఆమె కళ్ళేచెబుతున్నాయి.

"నీ మూలంగా ఒక ముఖ్యమైన విషయం గురించి తెలుసుకోడానికి వచ్చా." అన్నాను.

ఆమె నా వంక ప్రశ్నార్థకంగా చూసింది.

"నీ బస ఈ బిల్డింగ్ పక్కన కాంపౌండ్‌లో ఉన్న ఔట్‌హౌస్ లోనేగా ? నువ్వు పొద్దస్తమానమూ ఇక్కడే ఉంటూంటావు. డాక్టరు శ్రీధర్ గురించి నీకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలీదు. ఒప్పుకుంటావా ?"

"ఆ(...." ఆమె తల ఊపింది.

"ఆయన అంతరంగిక విషయాల గురించి నువ్వేమైనా చెప్పగలవా ? ఆయనకు చాలామంది మిత్రులు ఉండొచ్చు. వారిలో ఆయన్ని కలుసుకోడానికి తరుచు ఎవరు వస్తూండేవారు ?"

మిస్ రీటా కొన్ని క్షణాలాగి జవాబిచ్చింది : "ఇటీవల వారం రోజులుగా మిసెస్ మేరీ తరచు ఇక్కడికి వచ్చేది.''

"మిసెస్ మేరీయా ?"

"ఆ(....మధ్యాహ్నం డాక్టరుగారికి కారు ప్రమాదం జరిగినప్పుడు ఇక్కడ డిస్పెన్సరీలోంచి నాతోపాటు ఒకామె బయటకు వచ్చింది చూడండి....ఆమే."

"ఆంగ్లో ఇండియన్ వనితలా ఉంది గౌనులో....ఆమేనా ?''

"ఆమేనండి. వారు క్రైస్తవులే అనుకోండి. కాని, వాళ్ళింట్లో అంతా ఆంగ్ల పద్ధతిలో చాలా నవనాగరికుల్లా ఉంటూంటారు."

"ఆమె ఎవరు ?"

''మిస్టర్ ప్రభు అని ఒక బిల్డింగ్ కాంట్రాక్టర్ ఉన్నారు. మీరాయన పేరు విన్నారా ? ఆయన భార్య.''

"ఆమె డాక్టర్‌గారిని తరుచు ఎందుకు కలుసుకునేదో నీకేమైనా తెలుసా?"

"ఏదో జబ్బని అనుకుంటా...."

"ఏం జబ్బు ? ఇక్కడికి వచ్చే రోగులందరి జబ్బుల గురించి నీకు తెలిసే ఉండాలే ?"

"నిజమే....కాని, ఆమె అనారోగ్యం గురించి మాత్రం నాకేమీ తెలీదండి. ఆమె డాక్టర్‌గారి ప్రయివేట్ గదిలోకి ప్రతిరోజూ వెళ్ళి, అరగంట పాటు ఆయనతోనే రహస్యంగా మాట్లాడ్తూ ఉండిపోయేది. డాక్టరుకు తప్ప మరెవ్వరికీ తెలియకూడని అంత రహస్యమైన జబ్బేమిటో అని నేనూ అప్పుడప్పుడు ఆశ్చర్యపోయేదాన్ని...."

"ఆమె భర్త మీస్టర్ ప్రభు ఎప్పుడైనా ఆమెతో ఇక్కడికి వచ్చారా ?''

"ఊహు(....ఆయన ఇంతవరకు ఒక్కసారైనా డాక్టరు శ్రీధర్‌గారిని కలుసుకోగా నే చూడలేదండి."

"ఆ మేరీ చూడడానికి బాగానే ఉన్నట్లు కనిపించిందే ?''

"కొంతమంది చూడ్డానికి మంచి ఆరోగ్యవంతులుగానే కనిపిస్తారు. కాని, వాళ్ళకు లోలోపల ఏ గుండెజబ్బో - ఏదో ఒకటి ఉంటూంటుంది.''

మిస్ రీటా కళ్ళల్లోకి సూటిగా చూశాను. "రీటా ! నువ్వేదో దాసున్నావు. ఇంతకాలం డాక్టరు శ్రీధర్‌గారి ఉప్పుతిన్నావు. ఆయన్ని అన్యాయంగా హతమార్చిన రాక్షసులెవరో పట్టుకొని, వారికి తగిన శిక్ష విధిస్తేగాని, డాక్టరు శ్రీధర్ ఆత్మకు శాంతి లభిస్తుందా ? ఈ విషయంలో నాకు సాయంచేయవా ? డాక్టరు శ్రీధర్‌కు ద్రోహం చేస్తావా ?"

మిస్ రీటా చెవులు మూసుకుంది.

"నిజం చెప్పు. డాక్టరు శ్రీధర్‌కు మిసెస్ మేరీతో ఏదైనా సంబంధం ఉందా ?" మరింత తీక్షణంగా అన్నాను.

"క్షమించండి. డాక్టరు శ్రీధర్‌గారు ఇంతవరకు మంచివారుగా

ఈ లోకంలో పేరు తెచ్చుకున్నారు. వారు మరణించాక - ఆ మంచిపేరు పోయి చెడ్డపేరు వారికి రావటం నా కిష్టంలేదు."

"అంటే?"

"మీరే ఊహించుకోండి. అంతకన్నా నేనింకేం చెప్పను? డాక్టరు శ్రీధర్ అవివాహితులు. ఆ మిసెస్ మేరీ మంచి అందకత్తె. ఆమె భర్త ముసలాడు...."

బుర్ర గోక్కుంటూ, డాక్టర్‌గారి ప్రైవేట్ గదిలో ఉన్నప్పుడు వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకునేవారో నువ్వు ఒక్కసారైనా వినలేదా?" అన్నాను.

"పొంచి వినేటంత సంస్కార విహీనురాల్ని కాను నేను. నా పనేమిటో నేను చూసుకుంటూంటాను. ఐతే...." అని నిమిషంపాటు ఆగి, "ఉదయం కూడా ఆ మిసెస్ మేరీ ఒకసారి వచ్చి, డాక్టరుగారి ప్రయివేట్ గదిలోకి వెళ్ళింది. అప్పుడు మాత్రం వాళ్ళిద్దరి మాటలూ ఒకటి రెండు ఆ గది పక్కన ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న నాకు వినిపించాయి," అంది మిస్ రీటా.

"ఆ మాటలేమిటో సందేహించకుండా వెంటనే నాతో చెప్పేయ్. అవి నాకు ఉపకరించిన ఉపకరించవచ్చు...."

"మిసెస్ మేరీ అన్న పల్కులు నే విన్నంతవరకు చెబుతాను.... 'ప్రభు ప్రాణాలనైనా వదులుతాడు కాని, నన్ను వదులుకోడానికి ఏ మాత్రం ఇష్టపడడు. ఇటీవల నేనిక్కడికి తరుచు వస్తున్నట్లు ప్రభుకు ఎలాగో తెలిసిపోయింది. ఇక ఆలస్యంచేస్తే, ఆనక విచారించాల్సి వస్తుంది. అతను వ్యభిచారి అనీ, కొంతకాలంగా అతని కాళ్ళకు కుష్ఠురోగం వ్యాపిస్తోందనీ రుజువు చేస్తూ నేను కోర్టులో విజ్ఞాపన పత్రాన్ని దాఖలుచేసి, అతన్నించి రెండుమూడు రోజుల్లోనే విడాకులు పొందాలి. అటుపైన వెంటనే మనం రిజిష్టర్ మేరేజ్ చేసుకోవాలి. ఇక ఆలస్యంచేస్తే, ప్రయోజనం లేదు. అతనికి అనుమానం ముదిరిందంటే నన్నేం చేస్తాడో అని ఓ వైపున భయంగా ఉంది' అని ఆమె అంటే, 'నువ్వు విడాకులు పొందిన మరుక్షణమే నేను నిన్ను వివాహం చేసుకుంటాగాని, అంతవరకు మీ యిద్దరి విషయాల్లో నేను జోక్యం కలిగించుకోవడం ఏ మాత్రం బాగుండదు. అసలది నా తత్త్వానికే విరుద్ధం. ఆ విడాకుల గొడవేదో నువ్వే—పడాలి. ఇలా అంటున్నందుకు క్షమించు....వస్తా....నేను అర్జంటుగా ఒక పేషంట్‌ను చూసిరావాలి' అంటూ డాక్టరు శ్రీధర్ ఆ గదిలోంచి బయటకు వచ్చారండి. ఆయనకు నేను మెడిసన్ ఛెస్ట్‌ను అందిస్తున్నప్పుడు మధ్యాహ్నం సరిగ్గా నాలుగు గంటలకల్లా తను తిరిగివస్తానని నాతో చెప్పి, వసారా మెట్లుదిగి కారుదగ్గరికి వెళ్ళారు. అప్పుడు వెళ్ళినవారు నాలుగు గంటలకు ఇక్కడికి తిరిగి వస్తున్నప్పుడే ఆ కారుకు బలి అయ్యారు...." చివరి వాక్యాలు అంటున్నప్పుడు ఆమె గొంతు బొంగురుపోయింది.

"అంతకుముందు డాక్టరుగారికోసం ఎవరైనా ఫోన్ చేశారా?"

"ఆఁ....దాదాపు రెండుగంటలప్పుడు ఒకాయన ఫోన్ చేశాడు. డాక్టరుగారు ఉన్నారా అని అడిగితే, 'లేరు; నాలుగు గంటలకు వస్తారు' అని చెప్పానండి" అంది మిస్ రీటా.

"అతనిపేరు చెప్పాడా?"

"లేదండి; నేనూ అడగలేదు....ఎవరో రోగి అనుకుంటా."

"ఓహో!" అని తల పంకిస్తూ, టెలిఫోన్ దగ్గరికి నడిచాను. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు డయల్ చేశాను. ఇన్‌స్పెక్టర్ ఈశ్వరే అటు చివర రిసీవర్‌ను అందుకున్నాడు.

"హల్లో...నేను అడ్వకేట్ అశోక్‌ను....మిస్టర్ ప్రభు అనే ఆయన ఇప్పు డక్కడ ఉన్నారా?"

"ఎవరూ? బాబ్జీ పని చేస్తున్న కంపెనీ యజమానేనా? ఆ ...పక్క గదిలో బాబ్జీతో మాట్లాడుతున్నారు. పిలవమంటారా?" అడిగాడు ఈశ్వర్.

"అఁహ ....అక్కర్లేదు. నేనింకా అరగంటలోనే అక్కడ ఉంటాను. అంతవరకు అతను మీ ఆఫీసును వదలి వెళ్ళకుండా చూడాలి".

"ఏమిటి సార్?"

"నేను వచ్చి చెప్తాగా? అతనికి ఏమాత్రం అనుమానం కల్గకుండా ఉండేలా ఏ కబుర్లలోకో దింపండి...నే వచ్చిన తర్వాత తమాషా చూడండి. అన్నట్టు—బాబ్జీ భార్య కుమారి అక్కడే ఉందా?"

"ఆ ....ఇప్పుడు నా ఎదురుగానే కూర్చొని ఉంది. ఐదు నిమిషాల క్రితమే ఆమె భర్తతో మాట్లాడి, ఇక్కడ నా గదిలోకి వచ్చి కూర్చుంది. మీ కోసం ఎదురుచూస్తూ."

"ఐతే, భర్తతో ఆమె ఏకాంతంగా మాట్లాడుకోడానికి వీలు కలిగించారన్నమాట? చాలా థాంక్స్."

"అబ్బే....నాకు థాంక్స్ ఎందుకండి? వాళ్ళ తరపున మీలాంటివారు లాయర్‌గా పని చేస్తున్నప్పుడు, వాళ్ళకు కూడా మేం తగు గౌరవం ఇవ్వాల్సి ఉంటుంది."

నవ్వుతూ, "దయచేసి ఆ కుమారికి రిసీవర్‌ను అందిస్తారా?" అన్నాను.

"అలాగే," అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్.

తర్వాత కుమారి కంఠం వినిపించింది "హలో!"

"నేను అశోక్‌నమ్మా....ఇంకో అరగంటలో అక్కడికి చేరుకుంటాను. నువ్వు అక్కడే వుండు. అన్నట్టు ఒక విషయం చెప్పమ్మాయ్. నువ్వు ఇటీవల మీ కారుకు పసుపు కుంకుమ లేవైనా పెట్టావా?"

"ఈ వేళ ఆయుధపూజ కదండీ....పూజ చేశాను."

"స్టీరింగ్ ముందుకూడా అక్కడక్కడ పసుపు కుంకుమలు పెట్టావా?"

"ఆఁ....ఇప్పు డా విషయం ఎందుకు అడుగుతున్నారండి?"

"ఉష్! ఇప్పుడు చెప్పను. ఇంకో అరగంటలో నీకే తెలుస్తుందిగా? అన్నట్లు నే నిలా అడిగానని తొందరపడి ఎవ్వరితోనూ చెప్పకు. ఏం?" అంటూ రిసీవరును హుక్‌మీద ఉంచేశాక, "థాంక్స్. రీటా....మళ్ళీ నిన్ను కలుస్తా....వొస్తా....అర్జంట్ పనుంది" అని, ఆమెదగ్గర సెలవుతీసుకొని, టాక్సీలో పోలీసు హెడ్‌క్వార్టర్‌కు చేరుకున్నాను.

అప్పుడు ఇన్‌స్పెక్టరు ఈశ్వర్ గదిలో అతనితోపాటు కుమారి, మిస్టర్ ప్రభు కూర్చొని ఉన్నారు. నేను సరాసరి వెళ్ళి మిస్టర్ ప్రభు పక్కనున్న ఖాళీ కుర్చీలో కూర్చుంటూ, "ఏమండి, ప్రభూగారూ! బాబ్జీతో మాట్లాడారా?" అన్నాను.

"ఆఁ....ఇన్‌స్పెక్టరుగారు దయతో అనుమతి నిచ్చారు. ఇప్పుడే బాబ్జీతో మాట్లాడి బయటకు వస్తున్నానో – లేదో ఇన్‌స్పెక్టరుగారు 'లోకాభిరామాయణం' గురించి మాట్లాడ్డానికని ఈ గదిలోకి రమ్మని నన్ను బలవంతం చేశారు."

"బాబ్జీ ఎలా ఉంటున్నాడు? ఏమన్నాడు? చాలా దిగులుగా ఉన్నాడా?"

"ఉండడండీ మరి? పాపం, చాలా క్రుంగిపోయాడు."

"అవునవును. అంతేగా? ఎవరో చేసిన హత్యానేరం అన్యాయంగా అతని నెత్తిన పడితే, క్రుంగిపోకుండా ఎలా ఉంటాడు? ఆ స్థితిలో ఎవరైనా అంతే. బాబ్జీ నిరపరాధి. త్వరలోనే ఆ విషయం రుజువవుతుంది. మీరుకూడా అతనికి సహాయపడాలి."

"ఆ మాట మీరు చెప్పాలా? అతని కోసం నా శక్తి వంచన లేకుండా సహాయం చేస్తాను.''

"మీ కాళ్ళకు కుష్ఠురోగం వ్యాపించిందట? ప్రస్తుతం ఎలా ఉంది?" అని ఉన్నట్టుండి నేను అడగడంతో చివాలున అతని దృష్టి అతని కాలి బూట్లకేసి మరలింది. అటుపైన నా వంక తీక్షణంగా చూశాడు.

''ఇప్పుడా ప్రస్తావన ఎందుకు?" అన్నాడు తడబడే గొంతుకతో.

"క్షమించండి. ఎవరో ఆ విషయం చెబితే - నేను నమ్మలేను. మిమ్మల్నే కనుక్కుంటే నిజానిజాలు తెలుస్తాయి అనుకున్నా. అంతే మరోలా భావించకండి....అన్నట్లు మీ ఇంట్లో ఆచార వ్యవహారాలన్నీ పాశ్చాత్య పద్ధతుల్లో సాగుతాయని విన్నాను. నిజమేనా?''

"నిజమే....మా నాన్నగారు అన్ని విషయాల్లోనూ మనకన్నా ఎంతో ముందంజవేసిన ఖండాలన్నీ చుట్టివచ్చారు. అప్పట్నించి మేం పాశ్చాత్య పద్ధతులకే అలవడ్డాం,'' అన్నాడు ప్రభు సగర్వంగా చూస్తూ.

"అంటే....వరి అన్నానికి బదులు రొట్టె, సాండ్‌విచెస్ భోంచేస్తుంటారా?"

"అవును.''

"పసుపు పొడిని మీ వంటకాల్లో వాడుతారా?''

"నాన్సెన్స్....అది అనాగరికులు తినే ఆహారంలో వాడే పదార్థం."

"బాగానే ఉంది. ఇక కుంకుమకు మీ ఇంట్లో అసలే స్థానం ఉండదనుకుంటా?''

"ఒకసారి మీరు మా ఇంటికి దయచేస్తే, మీకు అన్ని విషయాలూ తెలుస్తాయి. ఇంతకీ, ఇప్పుడీ సంగతి గురించి అడగడంకూడా అప్రస్తుతం.''

"ఎందుకు అడుగుతున్నానో చెప్తాను. ముందు మీ కోట్ జేబులోంచి రుమాలు బయటకు తీయండి.''

"ఎందుకు? మరో అనవసర ప్రస్తావనతో నాకు విసుగు కల్గించడానికా?"

"కాదు; దయచేసి ముందా జేబురుమాలును తీయండి.'' తటపటాయిస్తూనే మిస్టర్ ప్రభు జేబురుమాలును బయటకు తీశాడు. "మడత విప్పండి,'' అన్నాను. విప్పాడు. ఆ కర్చీఫ్‌కు అక్కడక్కడ అంటుకొని ఉన్న పసుపు కుంకుమల వంక చూపిస్తూ, "మరి, పాశ్చాత్య పద్ధతులకు అలవడిన మీ జేబురుమాలుకు ఈ పసుపు కుంకుమలు ఎలా అంటుకున్నాయండి?'' అన్నాను.

"అరే! ఎలా అంటుకున్నాయి!'' అంటూ మిస్టర్ ప్రభు ఆ జేబురుమాలును ఇటు అటు తిప్పిచూశాడు. తర్వాత విదిలించాడు, కుంకుమ మాత్రం అక్కడక్కడ రాలింది కాని, పసుపేమో చెక్కు చెదరకుండా ఉండిపోయింది. "ఆశ్చర్యంగా ఉంది! నేనీ మరకలను గమనించనే లేదే!'' అన్నాడు మళ్ళీ.

"అవును గమనించలేదు. ఎలా గమనిస్తారు గాభరాలో? ఇంతవరకు మీ రది గమనించకపోవడమే మాకు మేలు చేసింది; మీకు కీడు తెచ్చింది. మీ నేరాన్ని బయట పెట్టేసింది.''

"నాన్సెన్స్! మీరేం మాట్లాడుతున్నారో మీకేమైనా తెలిసే మాట్లాడుతున్నారా?'' అంటూ దాదాపు గర్జించాడతను.

"తెలిసే మాట్లాడుతున్నాను, మిస్టర్... డాక్టరు శ్రీధర్ మీదికి కారును పోనిచ్చి చంపింది మీరేనని నాకు తెలుసు."

"నేనా? అబ్సర్డ్! ఆయన్ని నే నెందుకు చంపుతాను? ఇంతవరకు ఒక్కసారైనా నేనాయన్ని కలుసుకోలేదు."

"అది నిజమే. కాని, మీ భార్య మిసెస్ మేరీ మాత్రం వారం రోజులుగా ఆయన్ని తరచు కలుసుకుంటోంది. వాళ్ళిద్దరికీ ఎప్పుడు, ఎక్కడ, ఎలా పరిచయం ఏర్పడిందోకాని, ఆ పరిచయం చిగురించింది... మీరు కుష్ఠురోగి ....వయసుమీరినవారు. డాక్టర్ శ్రీధర్ బ్రహ్మచారి. స్ఫురద్రూపి అనే చెప్పాలి....అంచేత మీకు విడాకులిచ్చి, మీ భార్య ఆయన్ని రిజిస్టర్ మేరేజ్ చేసుకోవాలనుకుంది. ఆ విషయం మీకెలాగో తెలిసిపోయింది. బహుశా, ఈవేళ ఉదయం తొలుత ఒకసారి మీ భార్య డాక్టరు శ్రీధర్‌ను కలుసుకున్న తరువాత మీ ఇంటికి తిరిగివచ్చి ఉంటుంది. అప్పుడు మీ ఇద్దరికీ ఘర్షణజరిగి ఉండాలి. ఆ సమయంలో ఆవేశంలో మీ భార్య నోటినించి ఆ విషయం బయటపడి ఉండాలనుకుంటాను. మీ ఇద్దరిమధ్య డాక్టరు శ్రీధర్ అడుగెట్టినందుకు మీరు పిచ్చివారిలా అయిపోయారు. డాక్టరు పీడను వదిలించుకుంటే కాని, మీ దాంపత్యం పడిపోకుండా ఉండదు; మీ భార్య మీకు దక్కదు.... అందుకని డాక్టరు శ్రీధర్‌ను ఈ లోకంనించే తరలించాలన్న తలంపు మీ మస్తిష్కంలో మొలకెత్తింది....ఇకపోతే డాక్టరును చంపడానికి మీకీ రోజు అన్నీ చక్కగా కలిసొచ్చాయి... ఆయన మధ్యాహ్నం నాలుగు గంటలకు డిస్పెన్సరీకి తిరిగి వస్తారని మీరు తెలుసుకున్నారు. ఆయన్ని హతమార్చటానికి మీ ఆఫీసు బయట రోడ్డుమధ్య పార్క్ చేసి ఉన్న బాబ్జీయొక్క బ్యూక్ కారు తగిన ఆయుధంగా భావించారు. ఆ కారు తాలూకు తాళంచెవులు బాబ్జీ హేంగర్‌కు తగిలించిన అతని కోట్ జేబులో ఉన్నాయి. పైగా, బాబ్జీ ఆఫీసువదిలి ఎక్కడికీ కదలకుండా ఉండేలా మీ ఆఫీసుకు తతిమ్మా ఉద్యోగస్థులు ఎవ్వరూ రాలేదు. అదీకాక, హత్యాసమయంలో బాబ్జీ మీ ఆఫీసులోనే ఉన్నట్లు అతని ఎలిబీని రుజువు చేయడానికి సాక్షులెవరు లేరు. ఇంకో విషయం ఏమిటంటే - బాబ్జీ భార్యకు డాక్టరు శ్రీధర్ తదనంతరం ఆయన ఆస్తిపాస్తులు సంక్రమించబోతున్నాయి గనుక, అందరూ అతన్నే హంతకుడుగా అనుమానిస్తారు; మరొకరిని అనుమానించరు; అందువల్ల మీదాకా ఏ గొడవా రావడానికి అవకాశం లేదనుకున్నారు. ఇలా అన్నీ కలిసిరావడం మీ ప్రయత్నాన్ని బలపరిచి, మీకు ధైర్యాన్ని చేకూర్చాయి.... మీ ఆఫీసునించి మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో బాబ్జీ కారులో బయలుదేరిన మీరు డాక్టరు శ్రీధర్ డిస్పెన్సరీకి కొంతదూరంలో ఆయన రాకకోసం నిరీక్షిస్తూ పొంచిఉన్నారో - లేక మీ వీధికి చేరుకున్న సమయానికే డాక్టరు శ్రీధర్ తన కారులో వచ్చి డిస్పెన్సరీముందు కొంత దూరంలో రోడ్డుపక్కగా ఆపాడో ఏమోకాని, మొత్తంమీద చివరివరకు మీ ప్లాట్ నిరాటంకంగా ఫలించింది. అందుకు మిమ్మల్ని మీరు అభినందించుకొని ఉండాలి....కాని, ఏనాటికైనా నేరస్థుడు పట్టుపడిపోక తప్పదు. న్యాయాన్ని అన్యాయమే జయించేటట్లుంటే - ఈ ప్రపంచం ఏనాడో అనంత విశ్వంలో లీనమై ఉండేది. డాక్టరు శ్రీధర్ అకాలమృత్యువుకు కారకులైన మీకు ఉరిశిక్ష తప్పదు, మిస్టర్ ప్రభూ" అన్నాను ఆవేశంతో.

"ఏమిటిది?" అంటూ తోకతొక్కిన త్రాచులా ప్రభు లేచి నిలుచున్నాడు. "ఈయనకు మతిపోయింది!" అన్నాడు. అతని నీగ్రో పెదవులు వికటాట్టహాసాన్ని ఉత్పత్తి చేశాయి.

''నాక్కాదు. ఇంకా స్వేపట్లో మీకే నిజంగా మతిపోతుంది. కూర్చో మిస్టర్!" అంటూ నే నతని భుజంమీద చెయ్యివేసి, బలంగా కూర్చోబెడుతూ, "మీ ఇంట్లో పసుపు కుంకుమలకు తావే లేదని మీరే ఇందాక ఒప్పుకున్నారా? మరి, మీ జేబురుమాలుకు ఆ మరకలు ఎలా అంటు

కున్నాయి? ఇనస్పెక్టరు ఈశ్వర్‌గారికి తగిన సంజాయిషీ ఇవ్వండి,'' అన్నాను.

ఇనస్పెక్టరు ఈశ్వర్ చెవులు రిక్కించి, ఆత్రంగా టేబుల్ ముందుకు వొంగాడు— ప్రభు నోట్లోంచి ఏం సమాధానం వస్తుందో నని.

ప్రభు జేబురుమాలువంక మళ్ళీ చూస్తూ, "నాకు కొంచెం టయిమ్ ఇస్తే, ఈ మరకలకు కారణ మేమిటో గుర్తుకు తెచ్చుకొని చెప్పగలను. ఇప్పుడు నాకేం తెలియదు," అన్నాడు.

''అవును; మీకు తెలియకపోవచ్చు. ఐతే, నే చెప్తా వినండి....ఈవేళ ఆయుధ పూజ పర్వదినం. హిందువులందరికీ ముఖ్యమైన పండుగలలో ఇదొకటి. బాబ్జీ భార్య అయిన శ్రీమతి కుమారి ఉదయం ఎప్పుడో వాళ్ళ బ్యూక్ కారుకు పూజ చేసింది. స్టీరింగ్‌కు, కారు లోపల అక్కడక్కడ పసుపు కుంకుమల బొట్లు పెట్టింది. మధ్యాహ్నం మూడున్నర గంటలప్పుడు మీరు ఆ బ్యూక్ కారులో కూర్చుని హడావిడిగా బయలుదేరుతున్నప్పుడు - స్టీరింగ్‌మీది పసుపు కుంకుమలను చూసి, 'ఇదేవిటి దర్టీగా?' అని చీదరించుకొనిఉంటారు. పాశ్చాత్య నాగరికతకు అలవడిన క్రైస్తవులైన మీకు మన భారతీయ సాంప్రదాయాల గురించి అంతగా తెలీదేమో. సరే....ఆ పరధ్యానంలో మీ జేబురుమాలుతో స్టీరింగ్‌మీద తుడిసి ఉంచాలి. లేదా, డాక్టర్ శ్రీధర్ హత్యానంతరం మీరు ఆ బ్యూక్ కారును తీసుకొచ్చి మీ ఆఫీసు ముందు యథాస్థానంలో ఉంచినప్పుడు - ముందు జాగ్రత్తకోసం - ఆ స్టీరింగ్ మీద, చుట్టుపక్కల మీ వేలిముద్రలు లేకుండా ఉండడానికి మీ జేబురుమాలుతో శుభ్రంగా తుడిచేసి ఉంటారు. అప్పుడుకూడా మీరు చాలా హడావిడిలో ఉన్నారాయె. ఆ కారు తాళంచెవులను తీసుకెళ్ళి యథాప్రకారం బాబ్జీ కోటు జేబులో పడేసేవరకు మీ గుండెదడ తగ్గదుగా? ఆ తర్వాతే మీరు 'హమ్మయ్య' అనుకొని ఉంటారు తృప్తిగా....' అని నేనింకా ఏదో చెప్పబోయేలోగానే ప్రభు ముఖం పాలిపోయింది. చూస్తూండగానే గుడ్లు తేలవేసి, తలవాల్చేశాడు'.

అంతవరకు మౌనంగాఉన్న ఇనస్పెక్టరు ఈశ్వర్ ''ఏమంటారు, మిస్టర్ ప్రభు?'' అని అడిగిన ప్రశ్నకు - పరిస్థితులు అనుకోకుండానే ఇంతగా విషమించాక, ఇక తను దేనికైనా సిద్ధపడక తప్పదని అప్పటికప్పుడే గుండె రాయి చేసుకున్న ప్రభు చేతులు చాపకుండా ఎలా ఉండగలడు?

అతని చేతులకు బేడీలు పడ్డాక, "ఈ జన్మలో మీ ఋణం తీర్చుకోలేను," అన్నాడు బాబ్జీ నాకు చేతులు జోడించి నమస్కరిస్తూ.

"మీ కేవిధంగా కృతజ్ఞత లర్పించుకోవాలో తెలీకుండాఉంది," అని అతని భార్య కుమారికూడా నా పాదాలను తాకబోయింది. ఆమెను వారిస్తూ, "నువ్వు ముందుగా కృతజ్ఞతలు అందజేయాల్సిన వ్యక్తి ఒక రున్నారు. ఆ మనిషి తోడ్పాటు లేనిదే అసలు నేనీ కేసును ఈ వేళే ఇంత త్వరితంగా భేదించి ఉండేవాడ్ని కానేమో...ఇప్పుడు మనందరం ఆ వ్యక్తిని కలుసుకోవాలి... పద," అన్నాను.

"ఎవరండి ఆ వ్యక్తి?" అంది కుమారి, తన ఆతురతను అణచుకోలేక.

''నర్సు రీటా,'' అన్నాను సిగరెట్ వెలిస్తూ.

''ఎవరూ! మా మామయ్య డిస్పెన్సరీలో పనిచేసే నర్సు రీటానా? అంటూ కుమారి కొన్నిక్షణాలపాటు నా వంకే గుడ్లప్పగించి చూస్తూండిపోయింది.

